ప్రతిభావంతులనే ఎంపికచేయండి: గవర్నర్

హైదరాబాద్, జూన్ 13 (నమస్తే తెలంగాణ) : ఉద్యోగ నియామకాల్లో అత్యంత ప్రతిభావంతులైన అభ్యర్థులనే ఎంపికచేయాలని రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్లకు సూచించారు. పబ్లిక్ సర్వీస్ కమిషన్లు రాజ్యాంగ విలువలను కాపాడాలని గవర్నర్ పిలుపునిచ్చారు. శుక్రవారం 'పబ్లిక్ సర్వీస్ కమిషన్లు-న్యాయ చిక్కులు' అనే అంశంపై నల్సార్ వర్సిటీలో నిర్వహించిన వర్క్‌షాప్ ముగింపు వేడుకల్లో గవర్నర్ పాల్గొన్నారు. ప్రతిభావంతులను ఎంపికచేసే బాధ్యతలను నిర్వహించడంలో ఎక్కడా రాజీపడొద్దని సూచించారు. నియామక ప్రక్రియలో పూర్తి పారదర్శకత పాటించాలని పేర్కొన్నారు. వర్క్‌షాప్‌లో తెలంగాణ, కర్ణాటక, గోవా, గుజరాత్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్లు బుర్రా వెంకటేశం, శివశంకరప్ప ఎస్ సాహుకర్, ఉదయ్‌సింగ్ ఎస్ రౌరానే, హస్ముఖ్ పటేల్, యూపీఎస్సీ జాయింట్ సెక్రటరీ సంతోష్ గోపాల్ అజ్మీరా, టీజీ ఈఆర్సీ చైర్మన్ జస్టిస్ దేవరాజు నాగార్జున్ తదితరులు పాల్గొన్నారు.

ఈ వారంలోనే స్థానిక నిర్ణయం!

ముఖ్య కార్యకర్తల సమావేశంలో మంత్రి సీతక్క

మహబూబాబాద్, జూన్ 13 (నమస్తే తెలంగాణ) : ఈ వారంలోనే స్థానిక సంస్థల ఎన్నికలపై నిర్ణయం వెలువడనున్నట్టు మంత్రి సీతక్క ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ మంచినీటి సరఫరా, స్త్రీ, శిశు సమక్షేమశాఖ మంత్రి సీతక్క శుక్రవారం మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ, గంగారం మండలాలకు చెందిన ముఖ్య కార్యకర్తల సమావేశం కొత్తగూడలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ వారంలోనే స్థానిక ఎన్నికలకు సంబంధించి నిర్ణయం వచ్చే అవకాశం ఉన్నదని, కార్యకర్తలు సిద్ధంగా ఉండి రెండు మండలాల్లో క్లీన్ స్వీప్ చేయాలని సూచించారు. జూలై చివరి నాటికి ఎన్నికలు పూర్తి చేసే యోచనలో ప్రభుత్వం ఉందని తెలిపారు. మొదట సర్పంచ్, తర్వాత ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు నిర్వహించే యోచనలో ప్రభుత్వం ఉన్నట్టు పేర్కొన్నారు. అయితే కాంగ్రెస్ కార్యకర్తల మీటింగ్‌కు మీడియాను రానీయకుండా ఇంటర్నల్ మీటింగ్‌లో ఈ విషయాలు మాట్లాడినట్టు సమాచారం.

ఐఈఆర్పీలకు ఉద్యోగ భద్రత కల్పించాలి

మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ డిమాండ్

హైదరాబాద్, జూన్ 13 (నమస్తే తెలంగాణ): రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక పాఠశాలల్లోని 74,423 మంది దివ్యాంగ విద్యార్థులకు ఇరవై ఏండ్లుగా బోధిస్తున్న ఐఈఆర్పీ(ఇన్‌క్లూజివ్ ఎడ్యుకేషన్ రిసోర్స్‌పర్సన్స్)కు ఉద్యోగ భద్రత కల్పించాలని మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. సుప్రీంకోర్టు 2025 మార్చి 7న ఉత్తర్వులను పరిగణనలోకి తీసుకొని వెంటనే స్క్రీనింగ్ కమిటీ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తిచేశారు.

సివిల్స్ శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

హైదరాబాద్, జూన్ 13 (నమస్తే తెలంగాణ): సివిల్ సర్వీసెస్-2026 పరీక్షకు హాజరయ్యే ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులకు హైదరాబాద్ రాజేంద్రనగర్‌లోని ఎస్టీ స్టడీ సర్కిల్ ద్వారా ఉచిత రెసిడెన్షియల్ శిక్షణ ఇవ్వనున్నామని గిరిజన సంక్షేమ శాఖ సంచాలకులు తెలిపారు. ఈ నెల 14 నుంచి జూలై 4 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని శుక్రవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. దరఖాస్తుదారుల వార్షిక ఆదాయ పరిమితి రూ. 3లక్షలలోపు ఉండాలని పేర్కొన్నారు. ఆసక్తి, అర్హత కలిగిన వారు studycircle.cgg.gov.in వెబ్‌సైట్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని నిర్దేశించారు. రాత పరీక్ష ద్వారా అభ్యర్థులను ఎంపిక చేసి రెసిడెన్షియల్ శిక్షణ ఇవ్వనున్నామని వివరించారు. స్టడీ మెటీరియల్ సైతం సమకూర్చుతామని తెలియజేశారు. మరిన్ని వివరాలకు 6281766534 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

నేడు నీట్-యూజీ ఫలితాలు!

హైదరాబాద్, జూన్ 13 (నమస్తే తెలంగాణ) : ఎంబీబీఎస్, బీడీఎస్ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించిన నీట్-యూజీ ఫలితాలు శనివారం విడుదలయ్యే అవకాశాలున్నాయి. మే 4న జాతీయంగా నీట్-యూజీ పరీక్షను నిర్వహించారు. ఫైనల్ 'కీ'తోపాటు ఫలితాలను శనివారం వెల్లడించే అవకాశాలున్నట్టు సమాచారం.

16న ఇంటర్ సప్లిమెంటరీ ఫలితాలు

హైదరాబాద్, జూన్ 13 (నమస్తే తెలంగాణ) : ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల ఫలితాలు ఈ నెల 16న విడుదలకానున్నాయి. సోమవారం మధ్యాహ్నం ఫలితాలను విడుదల చేయాలని నిర్ణయించినట్టు ఇంటర్‌బోర్డు కార్యదర్శి కృష్ణ ఆదిత్య తెలిపారు. 4.2 లక్షల మంది విద్యార్థులు పరీక్షలు రాశారు.

సకుర సైన్స్ ఎగ్జిబిషన్‌కు ముగ్గురు రాష్ట్ర విద్యార్థులు

హైదరాబాద్, జూన్ 13 (నమస్తే తెలంగాణ) : జపాన్‌లో నిర్వహించే సకుర సైన్స్ ప్రోగ్రామ్‌కు రాష్ట్రానికి చెందిన ముగ్గురు విద్యార్థులు ఎంపికయ్యారు. ఇన్‌స్పైర్ జాతీయ పోటీల్లో విజేతలుగా నిలిచిన వారు జపాన్‌లో తమ ఆవిష్కరణలు ప్రదర్శించే అవకాశాన్ని దక్కించుకున్నారు. నారాయణపేట జిల్లా దామరగిద్ద సోషల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాల విద్యార్థి ఏ శివారెడ్డి, మంచిర్యాలలోని శ్రీచైతన్య పాఠశాల విద్యార్థి సాయి శ్రీవల్లి, కరీంనగర్‌లోని పారమిత హెరిటేజ్ స్కూల్ విద్యార్థి శుభశ్రీ సాహు ఎంపికైనట్టు ఎస్సీఈఆర్టీ డైరెక్టర్ జీ రమేశ్ తెలిపారు. వీరు 17 నుంచి 21 వరకు జపాన్‌లో నిర్వహించే ప్రదర్శనల్లో పాల్గొంటారని తెలిపారు. 2016 నుంచి ఇప్పటి వరకు 21 మంది విద్యార్థులు సకుర ప్రోగ్రామ్‌లో జపాన్‌ను సందర్శించారు.

నేటినుంచి డీఈఈసెట్ వెబ్ ఆప్షన్లు

హైదరాబాద్, జూన్ 13 (నమస్తే తెలంగాణ) : డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్(డీఈఎల్ఈడీ), డిప్లొమా ఇన్ ప్రీ స్కూల్ ఎడ్యుకేషన్(డీపీఎస్ఈ) కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించిన డీఈఈ సెట్ వెబ్ ఆప్షన్లు శనివారం నుంచి ప్రారంభంకానున్నట్టు డీఈఈ సెట్ కన్వీనర్ జీ రమేశ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 17 వరకు ఆప్షన్లు ఎంచుకోవచ్చని, 20న సీట్లు కేటాయిస్తామని పేర్కొన్నారు. సీట్లు పొందిన వారు 21 నుంచి 24 వరకు ట్యూషన్ ఫీజు చెల్లించి, అలాట్‌మెంట్ ఆర్డర్ పొందాలని, 25లోపు కాలేజీల్లో రిపోర్ట్‌చేయాలని వెల్లడించారు. జూలై 1 నుంచి ఫస్టియర్ క్లాసులు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు.

డిగ్రీలో మరో 43వేల మందికి సీట్లు

హైదరాబాద్, జూన్ 13 (నమస్తే తెలంగాణ) : డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్ తెలంగాణ(దోస్త్) రెండో విడతలో 43,568 మంది విద్యార్థులు సీట్లు పొందారు. దోస్త్ రెండో విడత సీట్లను శుక్రవారం కేటాయించారు. మొత్తం 46,883 మంది వెబ్ ఆప్షన్లు ఎంచుకోగా, 43వేలకు పైగా విద్యార్థులు సీట్లు పొందారు. మొదటి విడతలో సీట్లు పొందిన వారిలో 6,077 మంది ఇతర కాలేజీలు, కోర్సుల్లో సీట్లు పొందేందుకు రెండో విడతలో కౌన్సెలింగ్‌లో పాల్గొని సీట్లు దక్కించుకున్నారు. సీట్లు పొందిన వారు ఈ నెల 18లోగా ఆన్‌లైన్ సెల్ఫ్‌రిపోర్టింగ్ చేయాలని ఉన్నత విద్యామండలి చైర్మన్ వీ బాలకిష్టారెడ్డి సూచించారు. లేని పక్షంలో సీటు కోల్పోయినట్టేనని పేర్కొన్నారు. దోస్త్ మూడో విడత రిజిస్ట్రేషన్ శుక్రవారం నుంచే ప్రారంభమయ్యిందని, 19లోగా వెబ్ ఆప్షన్లు ఎంచుకోవచ్చని, 23న సీట్లు కేటాయిస్తామని వెల్లడించారు.

టీచర్లకు ఫేషియల్ రికగ్నిషన్ హాజరు

హైదరాబాద్, జూన్ 13 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలోని ప్రభుత్వ టీచర్లకు ఫేషియల్ రికగ్నిషన్ హాజరును విద్యాశాఖ అమలుచేయనున్నది. ప్రస్తుతం రిజిస్ట్రేషన్ ప్రక్రియ ట్రయల్స్‌ను ప్రారంభించింది. ఈ హాజరు కోసం డీఎస్ఈ ఎఫ్ఆర్ఎస్ యాప్‌ను వినియోగిస్తున్నది. ఈ యాప్‌లో స్టాఫ్ రిజిస్ట్రేషన్ ఆప్షన్ ఇచ్చారు. పాఠశాల జీపీఎస్ లొకేషన్ ఆధారంగా హాజరును నమోదుచేయనున్నారు. కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలో ఓ టీచర్ హాజరు నమోదు చేసేందుకు యత్నించగా.. 'మీరు పాఠశాల ప్రాంగణం బయట ఉన్నారు. ఇలా పాఠశాల ప్రాంగణానికి ఔట్‌సైడ్‌లో ఉండి హాజరు నమోదు చేయలేరు. మీరు స్కూల్ లొకేషన్‌కు 10వేల మీటర్ల దూరంలో ఉన్నారు.' అని చూపించడంతో సదరు టీచర్ అవాక్కయ్యారు. జనగామ జిల్లాకు చెందిన మరో టీచర్ హాజరు నమోదు చేసేందుకు ప్రయత్నిస్తే 773 మీటర్ల దూరంలో ఉన్నట్టు చూపించింది. ఇది వరకు విద్యార్థులకు ఎఫ్ఆర్ఎస్ హాజరు నమోదుచేయగా, ఇక నుంచి టీచర్లకు విస్తరించనున్నారు.

రాష్ట్రానికి కేంద్ర విద్యాశాఖ సహాయ మంత్రి

హైదరాబాద్, జూన్ 13 (నమస్తే తెలంగాణ) : కేంద్ర విద్యాశాఖ సహాయ మంత్రి జయంత్ చౌదరి ఈ నెల 15, 16 తేదీల్లో రాష్ట్రంలో పర్యటించనున్నారు. 15న సీఎం రేవంత్‌రెడ్డితో భేటీ కానున్నారు. ఆ తర్వాత సాయంత్రం బషీర్‌బాగ్‌లోని ఎస్సీఈఆర్టీని సందర్శిస్తారు. 16న నిజాం లా కాలేజీలో నిర్వహించే రోజ్‌గార్ మేళాను ప్రారంభిస్తారు. ఆ తర్వాత కన్హాశాంతి వనంలో నిర్వహించే దక్షిణాది రాష్ట్రాల స్కిల్ డెవలప్‌మెంట్ మినిస్టర్స్ సమావేశంలో పాల్గొంటారు.

ఎండోమెంట్‌లోకి ఇతర ఉద్యోగులు!

- డిప్యూటేషన్‌పై పంపాలంటూ వివిధ శాఖలకు కమిషనర్ లేఖ
- రగిలిపోతున్న దేవాదాయ ఉద్యోగులు
- డిప్యూటేషన్లు ఆపాలని కోరుతూ దేవాదాయ శాఖ మంత్రికి విజ్ఞప్తి
- తమకే ప్రమోషన్లు ఇవ్వాలని విన్నపం

మంత్రి సురేఖకు వినతిపత్రం ఇస్తున్న దేవాదాయ శాఖ ఉద్యోగులు

హైదరాబాద్ సిటీబ్యూరో, జూన్ 13 (నమస్తే తెలంగాణ): దేవాదాయ, ధర్మాదాయ శాఖలోకి ఇతర శాఖల ఉద్యోగులను డిప్యూటేషన్‌పై ఇవ్వాలంటూ ఆ శాఖ కమిషనర్ వెంకట్రావు ఈ నెల 9న మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ శాఖ డైరెక్టర్‌తోపాటు పలు శాఖలకు లేఖలు పంపారు. తమ శాఖలో రెగ్యులర్ రిక్రూట్‌మెంట్లు పూర్తయ్యేవరకు అసిస్టెంట్ కమిషనర్లు, ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్లు, డిప్యూటీ కమిషనర్లుగా పనిచేయడానికి వివిధ విభాగాల్లో అర్హతలు కలిగిన ఉద్యోగులను డిప్యూటేషన్‌పై కేటాయించాలంటూ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలతో పాటు మరో ఐదు శాఖలకు లేఖ రాసినట్టు తెలిసింది. రాష్ట్రంలో 646 అసెసబుల్ దేవాలయాలు ఉన్నాయని, అవి తమ శాఖ నియంత్రణలో నడుస్తున్నాయని కమిషనర్ అందులో పేర్కొన్నారు. ప్రస్తుతం దేవాలయాల నిర్వహణకు సంబంధించి తమ శాఖలో డిప్యూటీ కమిషనర్ పోస్టు ఒకటి (స్టేట్ క్యాడర్), అసిస్టెంట్ కమిషనర్ పోస్టులు ఆరు (మల్టీ జోనల్), ఎగ్జిక్యూటివ్ గ్రేడ్-1 ఆఫీసర్ పోస్టులు ఆరు (జోనల్), గ్రేడ్-3 ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ పోస్టులు 61 చొప్పున ఖాళీగా ఉన్నాయని తెలిపారు. వీటిలో డిప్యూటీ కమిషనర్ పోస్టుకు డిప్యూటీ కలెక్టర్ లేదా అదే స్థాయిలో పేస్కేల్ ఉన్న అధికారి కావాలని, మిగతా పోస్టులకు అర్హతలను బట్టి వారి స్వీయ సమ్మతితో నియమించడానికి ప్రభుత్వం అనుమతించిందని కమిషనర్ ఆ లేఖలో పేర్కొన్నారు. దేవాదాయ శాఖలో 233 రెగ్యులర్ ఈవో పోస్టులకు నియామకాలు లేనందున, వివిధ ప్రభుత్వ శాఖల నుంచి ఉద్యోగులను డిప్యూటేషన్‌పై తీసుకుని అవసరమైనచోట నియామకాలు చేపడతామని కమిషనర్ వివరించారు.

మంత్రిని కలిసిన 'దేవాదాయ' ఉద్యోగులు

దేవాదాయ శాఖలో డిప్యూటేషన్‌పై వేరే శాఖల నుంచి ఉద్యోగుల నియామకానికి ప్రభుత్వం అంగీకరించడంపై దేవాదాయ, ధర్మాదాయ శాఖ ఉద్యోగులు మండిపడుతున్నారు. తమ శాఖలోని వారికి ప్రమోషన్లు ఇచ్చి, కొత్త నియామకాలు చేపట్టాల్సింది పోయి వేరే శాఖల ఉద్యోగులను ఎలా తీసుకుంటారని ప్రశ్నిస్తున్నారు. ఈ మేరకు శుక్రవారం దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖను, ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజారామయ్యర్‌ను పలువురు అధికారులు, సంఘాల నేతలు కలిసి వినతిపత్రం అందజేశారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో ఆర్‌జేసీ రామకృష్ణారావు, డిప్యూటీ కమిషనర్లు సంధ్యారాణి, శ్రీకాంతరావు, తెలంగాణ అర్చక, ఉద్యోగుల జేఏసీ చైర్మన్ గంగు ఉపేంద్రశర్మ, రత్నాకర్, ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ల సంఘం సెక్రటరీ రాజేశ్, పలువురు అసిస్టెంట్ కమిషనర్లు, ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్లు ఉన్నారు. వేరే శాఖలకు చెందినవారిని డిప్యూటేషన్‌పై తీసుకోవద్దని కోరారు. రాష్ట్రంలోని సంస్థల్లో దాదాపు 250 మంది ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్లుతోపాటు క్లరికల్ సిబ్బంది పనిచేస్తున్నారని పేర్కొన్నారు. ఆలయ పరిపాలనలో తమకు అనుభవం ఉండటమే కాకుండా, ప్రమోషన్లకు సంబంధించిన పరీక్షలన్నీ పూర్తి చేసి అర్హతలు కలిగి ఉన్నామని వివరించారు. వివిధ క్యాడర్లలో తగినంత సంఖ్యలో ఖాళీలు ఉన్నప్పటికీ, ప్రమోషన్లు ఇవ్వకపోవడంతో తాము మానసిక వేదనకు గురవుతున్నామని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ప్రమోషన్లు రాకుండానే చాలామంది రిటైర్ అవుతున్నారని, ఆ మేరకు రిటైర్మెంట్ బెనిఫిట్స్ కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. అనేకమంది కన్సాలిడేటెడ్, ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో దేవాదాయ శాఖలో పనిచేస్తున్నారని, అవసరాన్ని బట్టి వారిని పలు పోస్టుల్లో నియమించుకోవాలని, అదేవిధంగా ప్రమోషన్లు ఇచ్చి తమ శాఖ ఉద్యోగులనే ఈవోలుగా నియమించాలని దేవాదాయ శాఖ ఉద్యోగులు కోరారు.

డీఏ 3.64%

- 28 సమాన వాయిదాల్లో ఎరియర్స్ చెల్లింపు
- ప్రభుత్వంఉత్తర్వులు జారీ

హైదరాబాద్, జూన్ 13 (నమస్తే తెలంగాణ): ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు అందాల్సిన ఐదు పెండింగ్ డీఏ (కరువు భత్యం)ల్లో ఒక డీఏను ప్రభుత్వం విడుదలచేసింది. ఈ మేరకు ఉద్యోగులు, పెన్షనర్లకు ఒక డీఏ 3.64% మంజూరు చేస్తూ శుక్రవారం ఉత్తర్వులిచ్చింది. బేసిక్ పేపై ప్రస్తుతం ఉన్న డీఏను 26.39% నుంచి 30.03 శాతానికి పెంచుతూ ఆర్థికశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్‌కుమార్ సుల్తానియా శుక్రవారం జీవో-78, జీవో-79 జారీచేశారు. పెరిగిన డీఏ 2023 జనవరి 1 నుంచి వర్తిస్తుందని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. నూతన డీఏతో కూడిన వేతనాన్ని ఉద్యోగులు 2025 జూలై 1న అందుకుంటారు. అంటే జూన్ వేతనంలో నూతన డీఏ కలుస్తుంది. ఇక 1 జనవరి 2023 నుంచి మే 2025 వరకు గల డీఏ ఎరియర్స్‌ను మొత్తం 28 సమాన వాయిదాల్లో చెల్లిస్తామని సర్కారు స్పష్టంచేసింది. 2023 జూలై 1కి సంబంధించిన డీఏ ఉత్తర్వులను ఆరు నెలల తర్వాత ప్రత్యేకంగా విడుదల చేస్తామని పేర్కొన్నది. ఇటీవల క్యాబినెట్‌లో తీసుకున్న నిర్ణయాల మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది.

రెండ్రోజుల్లో 153 స్కూల్ బస్సుల సీజ్

హైదరాబాద్, జూన్ 13 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రవ్యాప్తంగా గురు, శుక్రవారాల్లో తనిఖీలు చేపట్టిన అధికారులు 198 కేసులు బుక్ చేసి, 153 బస్సులను సీజ్ చేసినట్టు రవాణాశాఖ విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్(జేటీసీ) ఎం చంద్రశేఖర్ గౌడ్ తెలిపారు. హైదరాబాద్‌లో అత్యధికంగా 42 కేసులు నమోదు చేసి 33 బస్సులు స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు. రంగారెడ్డి జిల్లాలో 42 కేసులు నమోదు చేసి 43 బస్సులను సీజ్ చేశామని తెలిపారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో 21 కేసులు నమోదు చేసి 18 బస్సులను సీజ్ చేసినట్టు వెల్లడించారు. బస్సుల ఫిట్‌నెట్ విషయంలో స్కూళ్ల యాజమాన్యాలు నిర్లక్ష్యం చేయొద్దని, తక్షణం ఫిట్‌నెస్ పరీక్షలు చేయించుకోవాలని ఆదేశించారు. లేకపోతే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

హాస్టల్ ముందు ఆందోళన చేస్తున్న నిజాం కళాశాల విద్యార్థులు

నిజాం కళాశాల హాస్టల్ మెస్ మూసివేత

- రెండ్రోజులుగా ఆహారం లేక అవస్థలు
- మెస్ తెరవాలని విద్యార్థుల ఆందోళన

ఉస్మానియా యూనివర్సిటీ: ఉస్మానియా యూనివర్సిటీలోని నిజాం కళాశాల విద్యార్థుల హాస్టల్ మెస్‌ను అధికారులు రెండు రోజుల క్రితం మూసివేశారు. అప్పటి నుంచి ఆహారం కోసం ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు శుక్రవారం ఆందోళనకు దిగారు. తార్నాకలోని ఇంటర్నేషనల్ హాస్టల్‌లో నిజాం కళాశాల విద్యార్థులకు వసతి సదుపాయం కల్పించి, అందులోనే వారికి మెస్‌ను కొనసాగిస్తున్నారు. ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు విడుదల చేయకపోవడంతో మెస్ నిర్వహణ భారంగా మారింది. బకాయిలు పెండింగ్‌లో ఉండటంతో నిత్యావసరాల రాక సైతం నిలిచిపోయింది. దీంతో మెస్‌ను మూసివేశారు. మెస్ మూసివేతపై కళాశాల ప్రిన్సిపాల్‌ను సంప్రదించగా, నిధుల కొరతతో మూసివేసినట్టు చెప్పారని విద్యార్థులు తెలిపారు. నిజాం కళాశాల విద్యార్థులకు కాంగ్రెస్ పాలనలో భోజనం పెట్టలేని దుస్థితి నెలకొన్నదని వాపోయారు. కళాశాలకు నిధుల కొరత ఉన్నప్పటికీ వర్సిటీ అధికారులు ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. మెస్‌ను వెంటనే ప్రారంభించాలని, లేదంటే ఆమరణ నిరాహార దీక్షకు దిగుతామని, రాజకీయ పార్టీలు, విద్యార్థి, ప్రజా సంఘాలతో కలిసి సచివాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు.

దందాలు చేస్తున్నారా?

- కోర్టుల కంటే మీరు ఉన్నతులా?
- రెవెన్యూ, పోలీసులపై హైకోర్టు ఫైర్

హైదరాబాద్, జూన్ 13 (నమస్తే తెలంగాణ): అనవసర విషయాల్లో జోక్యం చేసుకుంటూ దందాలు చేస్తున్నారా? అంటూ రెవెన్యూ, పోలీసు అధికారులపై హైకోర్టు ఆగ్రహం వ్యక్తంచేసింది. భూమిపై హక్కుల వివాదం సివిల్ కోర్టులో పెండింగ్‌లో ఉండగా ఎలా జోక్యం చేసుకుంటారని సరూర్‌నగర్ తహసీల్దార్, మీర్‌పేట పోలీసులను ప్రశ్నించింది. శాంతి భద్రతల పేరుతో కోర్టు వివాదంలో ఉన్న భూమికి సంబంధించి రెవెన్యూ అధికారుల నుంచి నివేదిక ఎలా అడుగుతారని పోలీసులను నిలదీసింది. హక్కులను తెలుస్తూ ప్రొసీడింగ్స్ ఎలా జారీ చేస్తారని తహసీల్దార్‌పై మండిపడింది. కేసు పూర్వాపరాల్లోకి వెళ్తే, రంగారెడ్డి జిల్లా కర్మన్‌ఘాట్ సర్వే నంబర్ 60లో తనకు 400 గజాల ప్లాట్ ఉన్నదని, కానీ అది సర్వే నంబర్ 58లో ఉందంటూ తహసీల్దార్ ఇచ్చిన ప్రొసీడింగ్స్ చెల్లవంటూ బీ బుజ్జి అనే మహిళ హైకోర్టును ఆశ్రయించారు. జస్టిస్ సీవీ భాస్కర్‌రెడ్డి దీనిపై విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా పిటిషనర్ తరఫు న్యాయవాది తన వాదనలు వినిపిస్తూ తన క్లయింట్ ప్లాట్‌ను చక్రధర్ అనే వ్యక్తి తప్పుడు పత్రాలతో స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నిస్తే అడ్డుకున్నామని తెలిపారు. సివిల్ కోర్టు నుంచి ఇంజక్షన్ ఆర్డర్ కూడా తెచ్చుకున్నామని, అయితే, చక్రధర్ పోలీసులను ఆశ్రయించారని కోర్టుకు తెలిపారు. పోలీసులు తహసీల్దార్‌కు లేఖ రాస్తే, ఆయన పిటిషనర్ ప్లాట్ సర్వే నంబర్ 58లో ఉన్నదని లేఖ రాశారని తెలిపారు. పిటిషనర్‌కు నోటీసులు ఇవ్వకుండా తహసీల్దార్ ప్రొసీడింగ్స్ ఎలా జారీచేస్తారని ప్రశ్నించారు. తహసీల్దార్ ప్రొసీడింగ్స్ చూపించి ప్రైవేటు వ్యక్తులు పిటిషనర్ స్థలంలోకి చొరబడినా పోలీసులు చూస్తూ ఊరుకున్నారని వివరించారు. వాదనలు విన్న న్యాయమూర్తి రెవెన్యూ అధికారులు, పోలీసుల తీరుపై అసంతృప్తి వ్యక్తంచేశారు. పిటిషనర్ ప్లాట్‌పై తహసీల్దార్ ఇచ్చిన ప్రొసీడింగ్స్‌ను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీచేశారు.

18 నుంచి సీపీగెట్ రిజిస్ట్రేషన్లు

- పీజీ కోర్సుల్లో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల
- ఆగస్టు మొదటి వారంలో ప్రవేశ పరీక్షలు
- ఈ సారి కొత్తగా ఎర్త్‌సైన్స్ వర్సిటీలోని కోర్సుల్లో చేరిక

హైదరాబాద్, జూన్ 13 (నమస్తే తెలంగాణ) : పోస్ట్ గ్రాడ్యుయేట్ కోర్సుల్లో(పీజీ) ప్రవేశాలకు నిర్వహించే కామన్ పోస్ట్ గ్రాడ్యుయేట్ ఎంట్రెన్స్ టెస్ట్(సీపీగెట్)-2025 నోటిఫికేషన్ విడుదలయ్యింది. మాసాబ్‌ట్యాంక్‌లోని ఉన్నత విద్యామండలి కార్యాలయంలో మండలి చైర్మన్ ప్రొఫెసర్ వుడిత్యాల బాలకిష్టారెడ్డి శుక్రవారం నోటిఫికేషన్ విడుదల చేశారు. సీపీగెట్ రిజిస్ట్రేషన్ ఈ నెల 18 నుంచి ప్రారంభంకానుంది. ఆగస్టు మొదటి వారంలో ప్రవేశ పరీక్షలు నిర్వహిస్తారు. రాష్ట్రవ్యాప్తంగా 297 కాలేజీలున్నాయి. వీటిల్లో పీజీ కోర్సులతోపాటు, ఐదేండ్ల ఇంటిగ్రేటెడ్ పీజీ కోర్సులున్నాయి. ఆయా కోర్సుల్లోని సీట్లను సీపీగెట్ ద్వారా భర్తీచేస్తారు. ఈ ఎంట్రెన్స్ ద్వారా ఉస్మానియా, కాకతీయ, శాతవాహన, తెలంగాణ, మహాత్మాగాంధీ, పాలమూరు, జేఎన్టీయూహెచ్, చాకలి ఐలమ్మ మహిళా వర్సిటీల్లోని సీట్లను నింపుతారు. ఈసారి నుంచి కొత్తగూడెంలో ఏర్పాటు చేసే ఎర్త్‌సైన్స్ వర్సిటీలోని సీట్లను సైతం సీపీగెట్ ద్వారానే భర్తీచేస్తారు. మొత్తం మూడు విడతల్లో సీట్లు భర్తీచేసే అవకాశమున్నది.

ఏపీ కోటా కట్..

ఉమ్మడి రాష్ట్ర ప్రవేశాల గడువు ముగియడంతో ఈ సారి ఏపీ కోటా సీట్లకు కోతపెట్టారు. ఇది వరకు 15% సీట్లుండగా, ఇక నుంచి ఏపీ విద్యార్థులు అదర్‌స్టేట్ కోటాలో పోటీపడాల్సి ఉంటుంది. ఈ సారి నుంచి దివ్యాంగులకు ఐదుశాతం రిజర్వేషన్ వర్తింపజేస్తారు.

సగం సీట్లు కూడా నిండట్లే

రాష్ట్రంలోని పీజీ కాలేజీల్లో సగానికి పైగా సీట్లు నిండటం లేదు. ఏటా ఇదే పరిస్థితి ఉంటున్నది. నిరుడు కేవలం 46.12% సీట్లు మాత్రమే నిండాయి. దాదాపు 54% సీట్లు ఖాళీగా ఉన్నాయి. రాష్ట్రంలో మొత్తంగా 46,742 సీట్లుంటే నిరుడు 21,560 సీట్లు మాత్రమే భర్తీ అయ్యాయి. క్యాంపస్, కాన్‌స్టిట్యుయెంట్ కాలేజీల్లో 9,530 సీట్లకు 8,087 సీట్లు నిండాయి. ప్రభుత్వ పీజీ కాలేజీల్లో 9,570 సీట్లకు 4,518 సీట్లు భర్తీ అయ్యాయి. ఇక అఫిలియేటెడ్ కాలేజీల్లో 35,002 సీట్లకు కేవలం 12,643 సీట్లు మాత్రమే నిండాయి.

సీపీగెట్ షెడ్యూల్	షెడ్యూల్
ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రారంభం	18-06-25
రిజిస్ట్రేషన్‌కు తుది గడువు	17-07-25
500 ఆలస్య రుసుముతో గడువు	24-07-25
2వేల ఆలస్య రుసుముతో గడువు	28-07-25
ప్రవేశ పరీక్షలు	ఆగస్టు మొదటి వారంలో

'అక్రిడిటేషన్' జారీలో జాప్యమెందుకు: డబ్ల్యూజేఐ

ఖైరతాబాద్, జూన్ 13: తెలంగాణలో జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డుల జారీలో జాప్యమెందుకు జరుగుతున్నదని వర్కింగ్ జర్నలిస్ట్స్ ఆఫ్ ఇండియా జాతీయ అధ్యక్షుడు సంజయ్ ఉపాధ్యాయ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఆయన మాట్లాడుతూ తక్షణమే విధివిధానాలు ప్రకటించి, అర్హులందరికీ కార్డులివ్వాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టుల సంక్షేమానికి సంబంధించి పటిష్ఠమైన ఇన్సూరెన్స్, ఉచిత ఆరోగ్య చికిత్స, ఆరోగ్య కార్డులు వంటి అంశాలపై త్వరలో ముఖ్యమంత్రిని కలుస్తానని తెలిపారు. రైళ్లు, విమానాల్లో రాయితీలు, టోల్ ఛార్జీల మినహాయింపుల కోసం కేంద్రాన్ని కోరుతామని చెప్పారు. సెప్టెంబర్‌లో ఢిల్లీలో భారీ ర్యాలీ నిర్వహించి, ప్రధానిని కలిసి ఈ సమస్యలపై వినతిపత్రం సమర్పించనున్నట్టు తెలిపారు. డబ్ల్యూజేఐ ఆధ్వర్యంలో శనివారం ఉదయం ఉస్మానియా యూనివర్సిటీలో 'జాతీయ విద్యావిధానం-2020: మీడియా పాత్ర' అనే అంశంపై జాతీయ సెమినార్ నిర్వహించనున్నట్టు తెలిపారు.

జర్నలిస్ట్ రెహమాన్‌పై కేసులు ఎత్తివేయాలి: సీపీఐ

హైదరాబాద్, జూన్ 13(నమస్తే తెలంగాణ): జోగులాంబ గద్వాల జిల్లా పెద్దధన్వాడలో ప్రభుత్వం తలపెట్టిన ఇథనాల్ ఫ్యాక్టరీ వల్ల వచ్చే దుష్ప్రభావాలపై వరుస కథనాలు ప్రచురించిన జనంసాక్షి పత్రిక ఎడిటర్ ఎంఎం రెహమాన్‌పై పోలీసులు నమోదు చేసిన కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని సీపీఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం డిమాండ్ చేశారు. శుక్రవారం హైదరాబాద్‌లోని సీపీఐ రాష్ట్ర కార్యాలయంలో నెల్లికంటి సత్యం మాట్లాడుతూ ఇథనాల్ ఫ్యాక్టరీకి వ్యతిరేకంగా ఎనిమిది నెలలుగా రైతులు చేస్తున్న పోరాటాలపై వరుస కథనాలు రాసినందుకు ఫ్యాక్టరీ యాజమాన్యం పత్రికపై అక్కసు పెంచుకుందని ఆరోపించారు.

గద్దర్‌కు తీవ్ర అవమానం!

- ఆయన ఫొటో లేకుండానే మెమొంటో!
- ఆహ్వాన పత్రికల్లోనూ కనిపించని ఫొటో
- ఆంధ్రసినీ పెద్దల లాబీయింగ్‌కు తలొగ్గిన సీఎం రేవంత్‌రెడ్డి
- బీ నర్సింగరావు కమిటీ సూచనలను పక్కన పెట్టి అవార్డు పేరులోనూ మార్పు
- నెటిజన్లు, ప్రజల నుంచి విమర్శలు
- నేడు తెలంగాణ గద్దర్ ఫిలిం అవార్డుల ప్రదానం

హైదరాబాద్, జూన్ 13 (నమస్తే తెలంగాణ): ఆంధ్రా నేతల మంత్రాంగంతో మరణానంతరం ప్రజా గాయకుడు గద్దర్‌కు తీవ్ర అవమానం జరిగిందనే ఆవేదన వ్యక్తమవుతున్నది. గద్దర్ పేరుతో సినిమా అవార్డులు ప్రకటించిన తెలంగాణ ప్రభుత్వం.. గద్దర్ ఫొటో, ఆయనకు సంబంధించిన ఆనవాళ్లు లేకుండానే అవార్డుల మెమొంటోను డిజైన్ చేసిందనే విమర్శలొస్తున్నాయి. ఆంధ్రా సినీపెద్దల లాబీయింగ్‌కు తలొగ్గిన రేవంత్‌రెడ్డి ప్రభుత్వం బీ నర్సింగరావు కమిటీ సూచనలకు విరుద్ధంగా అవార్డు జ్ఞాపికలో గద్దర్ ఫొటోను తీసేసిందనే విమర్శలొస్తున్న నేపథ్యంలో.. ఆహ్వానపత్రికలపై సైతం గద్దర్ చిత్రం లేకుండా ముద్రించడం మరింత వివాదాస్పదమైంది. శనివారం హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో గద్దర్ ఫిలిం అవార్డుల ప్రధానోత్సం జరుగనున్నది. అవార్డుల కోసం ప్రత్యేకంగా రూపొందించిన జ్ఞాపికను ప్రభుత్వం విడుదల చేసింది. చేతికి రీల్ చుట్టుకున్నట్టుగా, చేతివేళ్ల సపోర్టుతో బొటనవేలు మధ్యన డప్పు పట్టుకున్నట్టుగా జ్ఞాపికను రూపొందించారు. ఆ డప్పు మీద తెలంగాణ రాష్ట్ర చిహ్నాన్ని ముద్రించారు. గద్దర్‌కు గుర్తింపుగా డప్పును ముద్రించినట్టు ప్రభుత్వం చెప్తున్నది. నిజానికి, గద్దర్ అనగానే గుర్తుకువచ్చేది గోచీ, గొంగడి, చేతికర్ర మాత్రమే! గోచీ పోసుకొని, భుజాన గొంగడితో ఎడమ అరచేతిని అడ్డంగా కొద్దిగా పైకెత్తి, కుడిచేతిలో లాల్-నీల్ జెండా కర్రపట్టుకొని సొంపుగా నర్తించే ఆహార్యమే గద్దర్ ట్రెండ్! అవార్డుల మెమొంటోలో ఈ ఆహార్యంతో కూడిన గద్దర్ బొమ్మ ఉంటుందని ఆయన అభిమానులు ఆశించారు. గద్దర్ అవార్డుల కోసం తెలంగాణ ప్రభుత్వం నియమించిన నర్సింగరావు కమిటీ కూడా జ్ఞాపికలో ఇదే ఆహార్యంతో కూడిన గద్దర్ బొమ్మ పెట్టాలని, గద్దర్ తెలంగాణ ఫిలిం అవార్డులుగా నామకరణం చేయాలని సూచించింది. కమిటీ సూచనలను తొలుత రాష్ట్ర ప్రభుత్వం ఆమోదించిందని అవార్డు జ్యూరీ సభ్యులు చెప్తున్నారు.

ఆంధ్రా సినీ ప్రముఖుల అయిష్టత!

గద్దర్ పేరిట అవార్డులు స్వీకరించడానికి ఇష్టపడని ఆంధ్రా సినీ ప్రముఖులు చాలాకాలం అవార్డుల ఎంపిక ప్రక్రియకు దూరంగా ఉన్నట్టు ప్రచారం జరుగుతున్నది. ప్రభుత్వ ఒత్తిడితో అవార్డులు తీసుకోక తప్పని పరిస్థితులు ఏర్పడి, బలవంతంగా అవార్డుల ఎంపిక ప్రక్రియలో పాల్గొన్నట్టు తెలిసింది. ఈ నేపథ్యంలోనే వారు అవార్డుల పేరు, జ్ఞాపిక డిజైన్‌పై పేచీ పెట్టినట్టు సమాచారం. 'గద్దర్ తెలంగాణ ఫిలిం అవార్డులు' అనే పేరులో మార్పును సూచిస్తూ..' తెలంగాణ గద్దర్ ఫిలిం అవార్డులు' అని పేరు పెట్టాలని సూచించినట్టు తెలిసింది. అవార్డు జ్ఞాపికలో గద్దర్ బొమ్మ ఉండవద్దనే షరతు పెట్టినట్టు సమాచారం. ఆంధ్రా సినీ ప్రముఖుల అభ్యంతరంపై తెలంగాణ ఫిలిం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ తీవ్ర అసహనం వ్యక్తంచేసినట్టు తెలిసింది. తెలంగాణ ప్రజల నుంచి వ్యతిరేకత వస్తుందని వారు ఆంధ్రా సినిమా వాళ్లకు చెప్పినట్టు సమాచారం.

చంద్రబాబు మంత్రాంగం!

సినీ పరిశ్రమపై గుత్తాధిపత్యం ఉన్న ఆంధ్ర ప్రముఖులు ఏపీ ముఖ్యమంత్రిని ఆశ్రయించి, మంత్రాంగం నడిపినట్టు టాలీవుడ్‌లో ప్రచారం జరుగుతున్నది. ప్రభుత్వ ఆలోచనల్లో మార్పు వచ్చిందని, చేతికి రీల్ చుట్టుకున్నట్టుగా ఉండి, పైన చేతివేళ్ల మధ్య తెలంగాణ సామాజిక, సాంస్కృతికకు ఆహార్యం ప్రకటించేవిధంగా ఉండే గద్దర్ బొమ్మ తొలగిపోయి, డప్పు పట్టుకున్నట్టుగా జ్ఞాపిక రూపుదిద్దుకున్నదని తెలంగాణ సినీవర్గాలు చెప్తున్నాయి. వారి లాబీయింగ్‌తో ఆహ్వానపత్రిక కూడా గద్దర్ ఫొటో లేకుండానే ప్రభుత్వం ముద్రించి పంపిణీ చేసిందని తెలంగాణ సినీవర్గాలు అంటున్నాయి. గద్దర్ అవార్డుల ఆహ్వానపత్రికలో గద్దర్ ఫొటో పెట్టకుండా కేవలం అవార్డు చిహ్నం ఫొటోను మాత్రమే ముద్రించారు.

గద్దర్‌ను అవమానించడమే : ఎమ్మెల్సీ కవిత

గద్దర్ సినీ అవార్డుల ఆహ్వానపత్రికలో గద్దర్ ఫొటో లేకపోవడం బాధాకరమని, ఈ చర్య ప్రజా గాయకుడు గద్దర్‌ను అవమానించడమేనని తెలంగాణ జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కవిత విమర్శించారు. ప్రభుత్వ తీరును తీవ్రంగా ఖండిస్తున్నట్టు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రతి సందర్భంలో గద్దర్ పేరును జపం చేసే కాంగ్రెస్ సర్కార్.. ఆయన పేరు మీద ఇస్తున్న సినీ అవార్డుల ఆహ్వానపత్రికలో గద్దర్ ఫొటో పెట్టకపోవడం బాధాకరమని పేర్కొన్నారు. కనీసం అవార్డుల పంపిణీ కార్యక్రమంలోనైనా గద్దర్ చిత్రపటాన్ని పెట్టి వారిని గౌరవించాలని సూచించారు.

ఓటుకు నోటు కేసుకు సీఎం గైర్హాజరు

నాంపల్లి క్రిమినల్ కోర్టులు, జూన్ 13 (నమస్తే తెలంగాణ): ఓటుకు నోటు కేసులో నిందితుడిగా ఉన్న సీఎం రేవంత్‌రెడ్డి శుక్రవారం జరిగిన విచారణకు గైర్హాజరయ్యారు. ఆయన తరఫు న్యాయవాది గైర్హాజరు పిటిషన్ దాఖలు చేయడంతో కోర్టు సీఎంకు మినహాయింపునిచ్చింది. ఈ కేసుతో సంబంధం ఉన్న సెబాస్టియన్, ఉదయ్ సింహ తదితరుల గైర్హాజరును కూడా కోర్టు అంగీకరించింది. ఈ విచారణకు సండ్ర వెంకటవీరయ్య, జెరూసలేం మత్తయ్య మాత్రమే హాజరయ్యారు. కేసు విచారణను త్వరితగతిన పూర్తి చేయాలని మత్తయ్య కోరారు. దీనిపై జడ్జి సురేశ్ స్పందిస్తూ హైకోర్టు నుంచి స్టే పొందాలని అప్పుడే ఈడీ కోర్టులో విచారణ కొనసాగుతుందని స్పష్టం చేశారు. తదుపరి విచారణను జూలై 25కు వాయిదా వేశారు.

రేవంత్‌రెడ్డి పిటిషన్‌పై విచారణ వాయిదా

హైదరాబాద్ :గచ్చిబౌలి పోలీస్ స్టేషన్‌లో తనపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీస్ చట్టం కింద నమోదైన కేసును కొట్టేయాలని కోరుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై హైకోర్టులో విచారణ వచ్చే వారానికి వాయిదా పడింది. గోపన్నపల్లి సర్వే నంబర్ 127లోని 31 ఎకరాల భూములకు సంబంధించిన హక్కుల విషయమై తలెత్తిన వివాదంలో ఎన్ పెద్దిరాజు ఫిర్యాదు చేయడంతో గచ్చిబౌలి పోలీసులు కేసు నమోదు చేశారు. ఆ కేసును కొట్టివేయాలని కోరుతూ 2020లో రేవంత్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై శుక్రవారం విచారణ జరిపి తదుపరి విచారణను వచ్చే వారానికి వాయిదా వేశారు.